క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పద్మనాభంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: త్రైత సిద్ధాంత భగవద్గీత, శ్రీ కృష్ణ జన్మాష్టమి విశిష్టతలపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాం పురం కమిటీ సభ్యులు పద్మనాభం గ్రామంలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పుడు, బి.పైడన్న, భవాని, శేఖర్, గణేష్, సత్యం పాల్గొన్నారు.

వైభవంగా హయగ్రీవ జయంతి



పూజలు అందుకున్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి

కొమ్మాది: హయగ్రీవ జయంతిని సోమవారం వైభవంగా నిర్వహించారు. భీమిలి బీచ్ రోడ్డు వారిజ ఆశ్రమంలోని శ్రీ లక్ష్మీ హయగ్రీవ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తిరుమంజనం (అభిషేకం), హోమం నిర్వహించిన అనంతరం హయగ్రీవ స్వామికి కవచ అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

కొలువుదీరిన చదువులమ్మ



పాఠశాలలో ప్రతిష్ఠించిన సరస్వతీ దేవి విగ్రహం

పద్మనాభం: చిన్నాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని ఎస్‌ఎంసీ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం ఎస్.నారాయణరావు ప్రతిష్ఠించారు. విగ్రహాన్ని విజయనగరం జ్ఞాన సరస్వతీ ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చారు.

వృద్ధుడి అదృశ్యం



కృష్ణమూర్తి నాయుడు (ఫైల్ ఫొటో)

పీఎం పాలెం: వృద్ధుడి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాజాంకు చెందిన తమరపు శ్రీనివాసరావు కొమ్మాది హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్నారు. మారికవలస శ్రీ చైతన్య కళాశాలలో పని చేస్తున్నారు. ఆయన తండ్రి కృష్ణమూర్తి నాయుడు ఈ నెల 14వ తేదీన రాజాం నుంచి కుమారుడు శ్రీనివాసరావు వద్దకు వచ్చారు. 16వ తేదీ సాయంత్రం బజారు వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి బయల్దేరి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

31న మహిళా న్యాయవాదులకు వర్క్ షాప్

సీతంపేట: మహిళా న్యాయవాదులకు ఈ నెల 31న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు మహిళా న్యాయవాదుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అనూరాధ, హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం విలేకరులతో వారు మాట్లాడారు. వర్క్ షాప్‌నకు ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి వి.ఎస్.భానుమతి, గౌరవ అతిథిగా తెలంగాణ హైకోర్టు జడ్జి ప్రియదర్శిని, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, విశాఖ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రవినాథ్, విశాఖ బార్ అసోసియేషన్ ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు.

కొండలను తొలచి నిర్మాణాలు

- కనుమరుగవుతున్న పచ్చని గిరులు
- నిర్లక్ష్యం వహిస్తే మరో వయనాడే..
- కలవరపడుతున్న స్థానికులు



కె.నగరపాలెం పరిధిలో కొండపై తవ్వి నిర్మిస్తున్న నిర్మాణం



తిమ్మాపురంలో కొండను తొలచి నిర్మించిన షెడ్లు

కొమ్మాది: సాగరతీరానికి అభిముఖంగా ఎత్తయిన పచ్చని కొండలు రోజురోజుకు కరిగిపోతున్నాయి. కొండలను పిండి చేసి అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ఇది ఎక్కడో మారుమూల గ్రామంలో జరుగుతోంది కాదు. విశాఖ–భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం, కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెంలో జరుగుతున్న విధ్వంస కాండ ఇది. ఇక్కడ కొండలను తొలచి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

తిమ్మాపురంలో ఓ వ్యక్తి కొండను మొత్తం స్వాధీనం చేసుకుని ఇష్టానుసారం తొలచి, అనధికారికంగా షెడ్‌లను నిర్మిస్తున్నాడు. చిన్నపాటి అధికారులు అడిగితే మాకు సొసైటీ ఉంది అంటూ కోర్టు అనుమతి ఇచ్చిందంటూ రుబాబు చేస్తున్నారని సమాచారం. నిజంగా ప్రభుత్వమే సొసైటీకి స్థలం మంజూరు చేస్తే ఓ ఉన్నతాధికారిని నియమించి స్థలంలో ప్లాట్లు వేసి లబ్ధిదారులకు అందజేస్తారు. కానీ తిమ్మాపురంలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోంది. ప్రభుత్వం అయినా, కోర్టు అయినా పచ్చని కొండలు తొలచి నిర్మాణాలు చేపట్టమని అనుమతులు ఇవ్వదు. కానీ బీచ్ రోడ్డు హైవేను ఆనుకుని ఉన్న తిమ్మాపురంలో కొండలను తొలచి పదుల సంఖ్యలో షెడ్‌లను నిర్మిస్తున్నా ఒక్క అధికారి కూడా ఇటుగా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీకి చెందిన నాయకుడనో లేక వేరే కారణాల వలనో అధికారులు మౌనం వహిస్తున్నారో తెలియటం లేదంటూ పలువురు అంటున్నారు. ఇదే బాటలో కాపుల దిబ్బడపాలెంలో కూడా కొండను తొలచి రోజురోజుకు పుట్టగొడుగుల్లా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు మౌనం వహిస్తున్నారు.

మరో వయనాడే..

బీచ్ రోడ్డు సమీపంలో ఉన్న ఈ కొండలను తొలచి నిర్మాణాలు చేపట్టడంపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు వీటిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోకుంటే ఇటీవల కేరళలోని వయనాడ్‌లో జరిగిన సంఘటనే ఇక్కడ జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. పచ్చని కొండలను ఇష్టానుసారం తొలిచేయడంతో భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పరస్పర సహకారంతో ఈ కొండలపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

తిమ్మాపురం, కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెం ప్రాంతాల్లో కొండలు తవ్వి చేపడుతున్న నిర్మాణాలను పరిశీలిస్తాం. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పచ్చని కొండలను తొలచి నిర్మాణాలు చేపట్టేవారు ఎంతటి వారైనా ఉపేక్షించం. ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

–పైలా రామారావు, తహసీల్దారు, భీమునిపట్నం

పాఠశాల పరిసరాలు పరిశుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



బాబ్‌కాట్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. పాఠశాల ముందు డంప్ భవన నిర్మాణ మెటీరియల్, డెబ్రిస్, తుప్పలు పేరుకుపోయి ఉండటంతో సాక్షి దినపత్రికలో సోమవారం 'డంపింగ్ యార్డ్‌లా పాఠశాల పరిసరాలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు స్పందించారు. పారిశుధ్య సిబ్బందితో బాబ్‌కాట్ సాయంతో తొలగించి, శుభ్రం చేయించారు. వాస్తవానికి రహదారులపై భవన నిర్మాణ మెటీరియల్, డెబ్రిస్ వేసినప్పుడు వాటిని ప్రజాజీవనానికి ఆటంకం లేకుండా చూడవలసిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానికి ఉంటుంది. వీళ్లు సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, పాఠశాల ప్రహరీపై వేసిన డెబ్రిస్, భవన నిర్మాణ మెటీరియల్ గురించి పాఠశాల యాజమాన్యం అభ్యంతరం తెలపకపోవడంతో ఇబ్బంది కలుగుతోంది. గతంలో ఇలా భవన నిర్మాణ మెటీరియల్ ప్రహరీని ఆనుకుని వేయడం వలనే కూలిపోయిన సంగతి తెలిసిందే. ఇకనైనా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు స్పందన కరువు

జోన్–2లో మూడు అర్జీలు



వినతిపత్రం స్వీకరిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2 కార్యాలయంలో జోనల్ కమిషనర్ శైలజావల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం కేవలం మూడు వినతులు మాత్రం అందాయి. కొమ్మాది, పీఎం పాలెం, శివశక్తి నగర్‌కు చెందిన శేషగిరి రావు, మోహన్ అనే ఇద్దరు ఇంటి పన్ను గురించి, మరో వ్యక్తి ఉమాపతి సీటి కనెక్షన్ కోసం వినతులు ఇచ్చారు. ఏసీపీ షట్‌నాన్ శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ శివ, ఈఈ శాంతి రాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు, ఎస్‌ఎస్ రాజు, ఏపీడీ గంగాధర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

భీమిలిలో మూడు వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు మూడు వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి మూడు వినతులు రాగా, పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని జెడ్సీ వెల్లడించారు.



వృక్షాబంధన్

రాఖీ పౌర్ణమి సందర్భంగా పద్మనాభం మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయంలో వృక్షా బంధన్ నిర్వహించారు. విద్యార్థినులు, సీఆర్టీలు విద్యాలయం ప్రాంగణంలో వృక్షానికి సోమవారం రాఖీలు కట్టారు. ఈ రాఖీలను విద్యార్థినులే స్వయంగా తయారు చేయడం విశేషం. వృక్షాలను రేపటి తరాలకు వారసత్వ సంపదగా కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తూ రక్షాబంధన్ కట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు. - పద్మనాభం

మందుబాబులకు రూ.44వేల 500 జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారికి న్యాయస్థానం రూ.44 వేల 500 జరిమానా విధించింది. ట్రాఫిక్ ఆర్‌ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతున్న 25 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరచగా వారికి ఒక్కొక్కరికీ రూ.2000 నుంచి 3000 చొప్పున మొత్తం 44వేల 500 రూపాయలు అపరాధ రుసుము విధించినట్లు ఆర్‌ఎస్‌ఐ తెలిపారు.

ట్రాఫిక్ చక్రబంధం



మధురవాడ హైవేపై కొమ్మాది -కార్ షెడ్ జంక్షన్ మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్

- మధురవాడ ప్రాంతంలో భారీగా నిలిచిన ట్రాఫిక్
- కొమ్మాది జంక్షన్–కార్ షెడ్ జంక్షన్‌కు గంటకు పైగా సమయం




హైవేపై చంద్రంపాలెం వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

మధురవాడ: మధురవాడలో సోమవారం ట్రాఫిక్ గంటకు పైగా నిలిచిపోయింది. రాత్రి 7.30 నుంచి 9గంటల వరకు జాతీయ రహదారిపై కొమ్మాది జంక్షన్–కార్ షెడ్ జంక్షన్ల మధ్య ట్రాఫిక్ భారీగా స్తంభించి పోయింది. దీంతో పోలీసులు చేతులెత్తేశారు. రెండు సిగ్నల్ వాహనాలు కలిసిపోయి 8గంటల సమయంలో కొమ్మాది నుంచి కార్‌షెడ్ చేరుకోవడానికి గంట సమయం పట్టింది. ద్విచక్ర వాహనాలను నడిపే పరిస్థితి లేక తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ రోడ్డులో చంద్రంపాలెం వద్ద ఆర్టీసీ బస్సు, క్రికెట్ స్టేడియం వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. సాధారణంగా ఇక్కడ ట్రాఫిక్ చాలా ఎక్కువ. ఈ రెండు వాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోవడంతో స్తంభించిన ట్రాఫిక్ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెట్టింది.


24 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ శివ నారాయణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలను తనిఖీలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నూరుద్దీన్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా హౌరాకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సుమారు రూ.1.20 లక్షల విలువైన 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా



బోని–శిర్లపాలెం గ్రామాల మధ్య బోల్తా పడిన ఆటో



గాయపడ్డ ప్రయాణికులు

తగరపువలస: ఆనందపురం మండలం బోని–శిర్లపాలెం పంచాయతీల మధ్య సింహాచలం–విజయనగరం రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిలి మండలం గొల్లల తాళ్లవలసకు చెందిన నమ్మి సురేష్, బీసపు సాయికుమార్ తమ ద్విచక్రవాహనంపై విజయనగరం జిల్లా అలమండ వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి ప్రయాణికులతో వేగంగా వచ్చిన ఆటో గట్టిగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు పక్కకు పడిపోగా, ఆటో కూడా రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణికులు కూడా స్వల్పంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై ఉన్న నమ్మి సురేష్‌కు తీవ్రగాయాలు కాగా సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆనందపురం పోలీసులు ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

చోరీ జరిగిన రెండు గంటల్లోనే దొంగ అరెస్ట్



దొంగను పట్టుకున్న భీమిలి పోలీసులు

తగరపువలస: దొంగతనం జరిగిన రెండు గంటల్లోనే భీమిలి క్రైం పోలీసులు దొంగను పట్టుకుని రిమాండ్‌కు తరలించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు తెలియజేశారు. జీవీఎంసీ ఒకటోవార్డు కొత్తపేట పిట్టావారి గుట్టకు చెందిన పీతల అనంత వెంకట స్వర్ణలత గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒంటరిగా, ఆమె సోదరుడు వెంకట హేమంత్ కుమార్ కుటుంబం ఫస్ట్‌ఫ్లోర్‌లో నివసిస్తున్నారు. సోమవారం ఉదయం 4.30 సమయంలో స్వర్ణలత బహిర్భూమి కోసం ఇంటి వెనుకకు వెళ్లగా చిట్టివలస వాణీ స్కూల్ ప్రాంతానికి చెందిన అలబాని ఆదినారాయణ అనే వ్యక్తి ఆమె తలపై ముసుగు వేసి మెడ నుంచి బంగారు వరలక్ష్మి కాసు, వెండి ఆంజనేయస్వామి లాకెట్ కలిగిన రెండు తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని పారిపోయాడు. ఆమె అరుపులు విన్న సోదరుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పీఎం పాలెం క్రైం డీఎస్‌ఐ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భీమిలి క్రైం సిబ్బంది స్థానికంగా సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి నిందితుడిని ఉదయం 6.30లోగా పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న వారిలో ఏఎస్‌ఐ ఆర్వీఎస్‌ఎన్ మూర్తి, కానిస్టేబుళ్లు ఊడికల వరలక్ష్మి, ఎం.శివకుమార్, ఎం.రాజేష్, ఎస్.రవిబాబు ఉన్నారు.

వేడుకగా 'రక్షాబంధన్'

అనాథబాలలకు రాఖీలు కట్టిన విద్యార్థులు



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థినులు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు రాఖీ కడుతున్న భీమిలి అనాథ ఆశ్రమం చిన్నారులు



అనాథ బాలలకు రాఖీలు కడుతున్న సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు



దుర్గానగర్ రాజయోగ కేంద్రంలో రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు రాఖీ కడుతున్న సోదరి బుగత విజయలక్ష్మి

తగరపువలస: శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్‌ను సోమవారం పలు విద్యాసంస్థలతో పాటు ఇంటింటా పండగలా వేడుకగా నిర్వహించారు. భీమిలి జోన్ ఒకటో వార్డు సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులు గొల్లల తాళ్లవలసలోని భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమంలో బాలలకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వాండ్రాసి సతీష్‌కుమార్, కరస్పాండెంట్ బోగెల కృష్ణ పాల్గొన్నారు.

- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సంఘం కార్యదర్శి గుజ్జు సూరిబాబు విద్యార్థులకు వంద రాఖీలు, స్వీట్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక, స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల తదితరులు పాల్గొన్నారు.
- మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాలలో రాఖీ పండగను వేడుకగా జరుపుకొన్నారు. సోదరుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ అక్కచెల్లెమ్మలు వారికి రక్షాబంధన్ కట్టగా, సోదరులు వారికి కానుకలందజేశారు.
- పీఎం పాలెం: మధురవాడ జోన్ బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో దుర్గానగర్ రాజయోగ కేంద్రంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారీ సంధ్యారాణి పలువురికి రాఖీలు కట్టి, రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. పురుషులతో పాటు మహిళలకు కూడా బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఐఐఎంవీలో యువ శాస్త్రవేత్తలకు ఇండక్షన్ ప్రోగ్రాం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో యువ శాస్త్రవేత్తలకు ఇండక్షన్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మొదటి బ్యాచ్‌లో 50 మంది యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జగదీష్ రాజేష్, డీజీ రాజీవ్ బహ్లా, ప్రోగ్రాం కో డైరెక్టర్ కావేరి కృష్ణన్, అదనపు డైరెక్టర్ జనరల్ సంఘమిత్ర పతి, ఐఆర్‌ఎస్ మనీషా సక్సేనా, సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రాయ్, సీనియర్ ఫైనాన్సియల్ అడ్వయిజర్ ఆర్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కమలప్రియే దేవీ..

శక్తిపీఠంలో అమ్మవారికి 2వేల కమలాలతో అర్చన, హోమం



కమలాలతో అమ్మవారికి అర్చన



అమ్మవారికి కమలాత్మిక హోమం

తగరపువలస: శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేట శ్రీవిద్యా శక్తిపీఠంలో అమ్మవారికి కమలాత్మక హోమం, పూజ నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిపించిన ఈ పూజల్లో వెయ్యి కమలాలు, హోమంలో వెయ్యి కమలాలు వినియోగించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను అభినందిస్తున్న భీమిలి నాయకులు



మధురవాడ, సాగర్‌నగర్ నాయకులు

తగరపువలస/మధురవాడ/కొమ్మాది: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు నాయకులు అభినందనలు తెలిపారు. విశాఖలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ శిల్లా కరుణాకరరెడ్డి, పందిరి విజయ్, జి.నాని, గొలుగూరి అమ్మిరెడ్డి, జగుపల్లి విజయ్, జగుపల్లి సతీష్, కోండ్రు రమణ, లెంక రమేష్, పిల్లా త్రినాథ్, దుంప సాయిరెడ్డి తదితరులున్నారు.

- బొత్స సత్యనారాయణను 8వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, మధురవాడ మాజీ సర్పంచ్ కుడితి రామారావు తదితరులు అభినందించారు.